# ఇండియన్ పాలిటీ

## భారత రాజ్యాంగ ప్రవేశిక, ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగ మూలతత్వాన్ని, స్వభావాన్ని, స్వరూపాన్ని, లక్ష్యాలను స్పష్టంగా, క్లుప్తంగా తెలియజేసేదే ప్రవేశిక లేదా పీఠిక. భారత రాజ్యాంగ సారమంతా ఇందులోనే ఇమిడి ఉంది. ఇది నాలుగు ముఖ్య విషయాలను వివరిస్తుంది. అవి...

**అధికారానికి ఆధారం:** ప్రవేశిక 'భారత ప్రజలమైన మేము' అనే వాక్యంతో ప్రారంభమై, 'ఈ రాజ్యాంగాన్ని చర్చించి, ఆమోదించి మాకు, మేము సమర్పించుకుంటున్నాము' అనే వాక్యంతో అంతమవుతుంది. దీన్ని బట్టి భారత రాజ్యాంగ నిర్మాణానికి, రాజ్యాంగం ద్వారా ఏర్పడిన ప్రభుత్వ అధికారానికి ఆధారం, మూలం భారత ప్రజలేనని అర్థమవుతుంది.

**రాజకీయ వ్యవస్థ స్వరూపం, స్వభావం:** 'సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర' రాజ్యంగా ప్రకటించింది.

**రాజకీయ వ్యవస్థ లక్ష్యాలు లేదా ఆశయాలు:** రాజ్యం లక్ష్యాలు.. ప్రజలందరూ సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమన్యాయాన్ని; ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, నమ్మకం, ఆరాధనల్లో స్వేచ్ఛను; హోదా, అవకాశాల్లో సమానత్వాన్ని సాధించడం; ప్రజలందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడటం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం.

**రాజ్యాంగ రచనా కాలం:** భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26 న రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది.

## ప్రాథమిక హక్కులు

ప్రాథమిక హక్కులను భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభాలుగా పేర్కొంటారు. భారత రాజ్యాంగంలోని 12 నుంచి 35 వరకు ఉన్న నిబంధనలు ప్రాథమిక హక్కుల గురించి తెలియజేస్తాయి. వీటిలోని 14, 20, 21, 22, 23, 24, 25, 27, 28 నిబంధనలు భారతీయులతోపాటు విదేశీయులకు కూడా వర్తిస్తాయి.

## ప్రాథమిక హక్కులు - చారిత్రక నేపథ్యం

భారతీయులు 19 వ శతాబ్దం నుంచే హక్కుల కోసం బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం ప్రారంభించారు. అయితే ప్రత్యేకంగా 'ప్రాథమిక హక్కుల' పేరుతో డిమాండ్ చేయడం మాత్రం 20 వ శతాబ్దంలోనే ప్రారంభమైంది.

★ భారత జాతీయ కాంగ్రెస్ 1927 లో మద్రాసు సభలో, 1931లో కరాచీ సమావేశంలో, 1938 లో హరిపుర సభలో ప్రాథమిక హక్కుల కోసం తీర్మానాలు చేసింది.

★ భారత రాజ్యాంగ పరిషత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన పని చేసిన సలహా సంఘం, జె.బి. కృపలానీ అధ్యక్షతన ఒక ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీ సూచనల ఆధారంగా రాజ్యాంగ పరిషత్ సలహాదారుడు బి.ఎన్. రావు హక్కులపై ముసాయిదాను తయారు చేశారు.

★ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి ఏడు ప్రాథమిక హక్కులు ఉన్నాయి. కానీ 1978 లో 44 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించి 300-A నిబంధనను చేర్చారు. ప్రస్తుతం ఇది ఒక చట్టబద్ధ హక్కు మాత్రమే.

★ కాబట్టి, ప్రస్తుతం 6 ప్రాథమిక హక్కులు మాత్రమే ఉన్నాయి. వీటికి న్యాయపరమైన రక్షణ ఉంది. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది.

## ప్రాథమిక హక్కులు - వివరణ

ప్రాథమిక హక్కులు స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, 17, 23, 24 నిబంధనల్లో ప్రస్తావించిన అంశాల అమలు కోసం పార్లమెంటు ప్రత్యేకంగా చట్టాలు చేయాల్సి ఉంటుంది. ఎం.వి. పైలి ప్రాథమిక హక్కులను ప్రధానంగా రెండు సమూహాలుగా విభజించారు. అవి...

1) ప్రాథమిక హక్కులకు సంబంధించిన సాధారణ అంశాలు (12, 13, 33, 34, 35 నిబంధనలు).

2) ప్రాథమిక హక్కులు - వర్గీకరణ (14 నుంచి 32 వరకు ఉన్న నిబంధనలు).

## నిబంధన 12

నిబంధన 12 'రాజ్యం' అంటే ఏమిటో వివరిస్తుంది.

ఎ) కేంద్ర ప్రభుత్వం (కార్యనిర్వాహక వర్గం), భారత పార్లమెంటు

బి) రాష్ట్ర ప్రభుత్వం (రాష్ట్ర కార్యనిర్వాహక వర్గం), రాష్ట్ర శాసనసభ (లు)

సి) స్థానిక ప్రభుత్వ సంస్థలు

డి) ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పడిన ఇతర సంస్థలను రాజ్యంగా పేర్కొంటుంది.

**ముఖ్యమైన కేసులు:**

**1.** అజయ్ హాసియా Vs ఖలీద్ ముజీబ్ కేసు (1981 సుప్రీం కోర్టు)

**2.** ఎ.ఆర్. అంతూలే Vs ఆర్.ఎస్. నాయక్ కేసు (1988 సుప్రీం కోర్టు)

**3.** టెక్రాజ్ వాసంది Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1988 సుప్రీం కోర్టు)

## నిబంధన 13

ఇది ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు చెల్లవని తెలియజేస్తుంది. ఇందులో నిబంధన 32 ప్రకారం సుప్రీం కోర్టు, నిబంధన 226 ప్రకారం హైకోర్టులు న్యాయసమీక్షాధికారం పొందడానికి కావలసిన అధికారాన్ని కల్పించారు. ఈ నిబంధనలో...

★ 13 (1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి రాక ముందున్న శాసనాల్లో ఏవైనా ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉంటే అవి చెల్లవు.

★ 13 (2) ప్రకారం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే శాసనాలు లేదా ఆదేశాలు చెల్లవు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత శాసనంలోని ఏదైనా ఒక భాగం లేదా క్లాజ్ ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉంటే అది చెల్లదు.

★ 13 (3) ప్రకారం చట్టం లేదా శాసనం నిర్వచనం. దీని ప్రకారం...

(a) ఆర్డినెన్స్, ఆదేశాలు, ప్రభుత్వ నియమ నిబంధనలు, నియంత్రణలు, నోటిఫికేషన్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రజల ఆచారాలు.

(b) **అమల్లో ఉన్న శాసనాలు:** రాజ్యాంగం అమల్లోకి రాకముందున్న శాసనాల్లో రద్దుకానివి అమల్లో ఉన్న శాసనాల పరిధిలోకి వస్తాయి.

★ 13 (4) ప్రకారం (368 వ నిబంధన) పార్లమెంటు చేసే రాజ్యాంగ సవరణలు 13 వ నిబంధన పరిధిలోకి రావు. గోలక్‌నాథ్ కేసులో ఇచ్చిన తీర్పును అధిగమించడానికి 1971 లో 24 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఈ క్లాజ్‌ను చేర్చారు. కానీ 1973లో కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ సవరణ చట్టాలు కూడా చట్టం పరిధిలోకి వస్తాయని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

**ముఖ్యమైన కేసులు:**

**1.** శంకరీ ప్రసాద్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (సుప్రీం కోర్టు 1951)

**2.** బికాజీ నారాయణ్ Vs మధ్యప్రదేశ్ ప్రభుత్వం (సుప్రీం కోర్టు 1955)

**3.** దీప్ చంద్ Vs ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం (సుప్రీం కోర్టు 1959)

**4.** అంబికా మిల్స్ Vs స్టేట్ ఆఫ్ గుజరాత్ (సుప్రీం కోర్టు 1974)

## నిబంధన 33

పార్లమెంటు ప్రాథమిక హక్కులను వర్తింపజేయడంలో కొన్ని వర్గాలకు సంబంధించి పరిమితులను విధించగలదు. అవి..

ఎ) సాయుధ దళాల్లోని సభ్యులు.

బి) శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యత కలిగి ఉన్నవారు.

సి) ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ (రహస్య సమాచార సేకరణ)

డి) పైన తెలిపిన ఎ, బి, సి వర్గాలకు అనుబంధంగా పనిచేసే బ్యూరో, టెలీకమ్యూనికేషన్స్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు.

**ముఖ్యమైన కేసు:**

★ ఆర్. విశ్వాన్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (సుప్రీం కోర్టు 1983)

**నిబంధన 34**

సైనిక శాసనం లేదా మార్షల్ లా అమల్లో ఉన్న సమయంలో ప్రాథమిక హక్కులపై ఆంక్షలు వర్తిస్తాయి. మార్షల్ లా విధించినప్పుడు ఆ సమయంలో సైనిక బలగాలు చేపట్టిన చర్యలకు, తద్వారా జరిగిన ఆస్తి నష్టాలు, శిక్షల అమలు, జారీ చేసిన ఉత్తర్వులకు వారిని బాధ్యులుగా చేస్తూ ఎలాంటి చర్యలు తీసుకోకూడదు. పార్లమెంటు చట్టం ద్వారా వారి చర్యలకు రక్షణ కల్పించవచ్చు. దీని ద్వారా ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందని న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వీల్లేదు.

**ముఖ్యమైన కేసు:**

ఎ.డి.ఎం. జబల్‌పూర్ Vs ఎస్.కె. శుక్లా కేసు (సుప్రీం కోర్టు 1976)

**నిబంధన 35 (a)**

నిబంధన 35 (a) ప్రకారం ప్రాథమిక హక్కులపై శాసనాధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. రాష్ట్రాలకు అధికారం లేదు.

★ 35 (i) ప్రకారం 16 వ నిబంధనలోని క్లాజ్ (3) (ఉద్యోగాల్లో రిజర్వేషన్), 32 వ నిబంధనలోని క్లాజ్ (3) (రిట్ అధికారాలు), 33 వ నిబంధన (సైనికులకు ప్రాథమిక హక్కులను పరిమితం చేయడం), 34 వ ప్రకరణ (మార్షల్ లా)లోని అంశాలపై శాసనాధికారం పార్లమెంటుకు మాత్రమే కల్పించారు.

★ 35 (ii) ప్రకారం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన శిక్షలపై నిర్ణయాధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది.

★ 35 (b) ప్రకారం పైన తెలిపిన విషయాలకు సంబంధించి రాజ్యాంగం అమల్లోకి రాకముందున్న చట్టాలు కొనసాగుతాయి. అయితే 372 వ నిబంధన ప్రకారం పూర్వ శాసనాలకు మార్పులు, చేర్పులు, సవరణలు చేసి కొత్త చట్టాలను కూడా పార్లమెంటు రూపొందించవచ్చు.

**ప్రవేశిక - రాజ్యాంగ సవరణ**

42 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రవేశికలో సామ్యవాద, లౌకిక, సమగ్రత అనే మూడు పదాలను చేర్చారు. ప్రవేశికను ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే సవరించారు.

**ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమా?**

ప్రవేశిక రాజ్యాంగ సారాంశాన్ని ప్రతిబింబిస్తున్నప్పటికీ రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగాన్ని, ప్రవేశికను విడిగా ఆమోదించడం వల్ల ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమా కాదా అనే అంశంపై రెండు రకాల అభిప్రాయాలకు అవకాశం ఏర్పడింది.

★ 1960 లో బెరుబరి యూనియన్ (పాకిస్థాన్‌కు బదిలీ చేసిన ప్రాంతం) వివాదంలో రాష్ట్రపతి సుప్రీం కోర్టును సలహా (ఆర్టికల్ 143) కోరారు. జస్టిస్ గజేంద్ర గడ్కర్ నాయకత్వంలోని బెంచ్ 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని' తెలియజేసింది.

★ 1973 లో కేశవానంద భారతి Vs కేరళ ప్రభుత్వం కేసులో (జస్టిస్ సిక్రి) ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం అని, మౌలిక స్వరూపంలో భాగమని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది.

★ తర్వాత వెలువడిన సుప్రీం కోర్టు తీర్పుల్లో కూడా ఇదే అభిప్రాయాన్ని సుప్రీం కోర్టు వెల్లడించింది. ఉదాహరణకు ఎస్.ఆర్. బొమ్మై Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1994) కేసులో సుప్రీం కోర్టు ప్రవేశికను రాజ్యాంగంలో అంతర్భాగంగా పేర్కొంది. అయితే, ప్రవేశికకు న్యాయసంరక్షణ లేదు. వీటి ఆధారంగా ప్రవేశికను ప్రస్తుతం రాజ్యాంగంలో అంతర్భాగంగా పేర్కొనవచ్చు.

★ చరణ్‌లాల్ సాహు Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1989) వివాదంలో సుప్రీం కోర్టు తీర్పునిస్తూ, ప్రవేశికలోని అంశాలను నేరుగా అమలు చేయడం సాధ్యం కానప్పటికీ, వాటి అమలుకు ప్రభుత్వాలు శాసనాలను రూపొందించాలని తెలిపింది.

ప్రవేశిక - వ్యాఖ్యానాలు

- 'ప్రవేశిక భారత ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థకు రాజకీయ జాతకం' - కె.ఎం. మున్షీ
- 'ప్రవేశిక రాజ్యాంగ ఆత్మ, రాజ్యాంగానికి తాళంచెవి లాంటిది' - పండిట్ ఠాకూర్‌దాస్ భార్గవ్
- 'ప్రవేశిక రాజ్యాంగానికి గుర్తింపు పత్రం లాంటిది' - ఎం.ఎ. నానీ పాల్కీవాలా
- 'ప్రవేశిక రాజ్యాంగానికి కీలక సూచికలాంటిది. అలాంటి సూచికలు సాధారణంగా పాశ్చాత్య రాజ్యవ్యవస్థలో ఉంటాయి. ఇది భారత రాజ్యాంగంలో ఉన్నందుకు నేను పులకించి, గర్వపడుతున్నాను' - ఎర్నెస్ట్ బార్కర్
- 'ప్రవేశిక మన కలలకు, ఆలోచనలకు రాజ్యాంగంలో వ్యక్తీకరించుకున్న అభిమతం' - అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
- 'ప్రవేశిక రాజ్యాంగ ఆత్మ' - జస్టిస్ మహ్మద్ హిదయతుల్లా

రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు

www.eenadupratibha.net
www.eenadupratibha.net